సత్యాజిత్ రే
అపూర్వ చిత్రానికి
నవలా మాతృక



# పథేర్ పాంచాలీ

బిభూతిభూషన్ బంధోపాధ్యాయ

# పథేర్ పాంచాలీ

## బిభూతిభూషన్ బంధోపాధ్యాయ

తెలుగు : మద్దిపట్ల సూరి

హైదరాబాద్ బుక్ ట్రస్టు


| | | |
|---|---|---|
| ధర | : | రూ. 80/- |
| తొలి ముద్రణ | : | విశ్వవాణి పబ్లిషర్స్, విజయవాడ, 1960 |
| హెచ్.బి.టి తొలి ముద్రణ | : | ఫిబ్రవరి 2008 |
| అట్టమీద బొమ్మ | : | దుర్గపాత్రలో ఉమాదాస్ గుప్తా. (సత్యజిత్ రే పథేర్ పాంచాలీ చిత్రం నుంచి) |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్ గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067 ఫోన్ : 23521849, 23517401 |

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194

## ముందుమాట



# అజరామర పథగీతం

'పథేర్ పాంచాలీ' అనగానే మనకు చప్పున గుర్తుకొచ్చేది సత్యజిత్ రే, ఆయన రూపొందించిన 'అపూ' చిత్రత్రయం! మొట్టమొదటిసారిగా యావత్ ప్రపంచం దృష్టిని భారతీయ సినిమావైపు ఆకర్షించిందీ, సత్యజిత్‌రేకు అంతర్జాతీయ గుర్తింపునూ, అపార ఖ్యాతినీ ఆర్జించి పెట్టింది ఈ చిత్రత్రయమే. వీటిలో మొదటిది పథేర్ పాంచాలీ (1955), మిగిలిన రెండూ అపరాజిత (1956), అపూర్ సంసార్ (1959). ఈ చిత్రాలు మూడింటికీ కూడా ప్రఖ్యాత బెంగాలీ రచయిత బిభూతిభూషన్ బంధోపాధ్యాయ్ రాసిన రెండు విశిష్ట నవలలే ఆధారం.

40వ దశకంలో శాంతినికేతనంలో లలితకళలు, గ్రాఫిక్ డిజైనింగ్ అభ్యసించి బయట కొచ్చిన సత్యజిత్ రేను సినిమాలు ఎంతగానో ఆకర్షించాయి. కానీ భారతీయ సినిమాల్లో ఎంతకీ తీపి వలపుల ప్రేమ పాటలు, మార్మిక పురాణగాథలే రాజ్యమేలుతుండటం ఆయన్ను చాలా చికాకు పెట్టింది. "సినిమాకు జీవితమే ముడిసరుకు కావాలి. సినిమా వంటి విస్తృత జనమాధ్యమానికి స్ఫూర్తి మన జీవితంలో, మన మూలాల్లో ఉండాలి. సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం వంటి రంగాల్లో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిన ఈ దేశం చిత్రదర్శకులను కదిలించలేకపోవటం విడ్డూరం. వాళ్లు తమ కళ్ళూ, చెవులూ తెరుచుకుని ఉంటే చాలు!." ఈ వేదనే సత్యజిత్‌రేను సినిమాల వైపు దృఢ సంకల్పంతో నడిపించింది. ఒకవైపు అప్పుడే సాధించుకున్న దేశ స్వాతంత్ర్యం తాలూకు ఉత్సాహం అన్ని రంగాల్లోనూ కొత్త ఊపిరులూదు తోంది. గాఢమైన జీవితానుభూతితో సినిమా రూపొందించాలని నిర్ణయించుకున్నప్పుడు ఆయనకు మొట్టమొదటగా తట్టిన కథావస్తువు 'పథేర్ పాంచాలీ' నవల. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను అధిగమించి ఆయన రూపొందించిన ఆ సినిమా- ఆ తర్వాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అత్యుత్తమ మానవ చిత్రణా పురస్కారం (1955)తో సహా దేశవిదేశాల్లో ఎంతగా ప్రాచుర్యం పొందిందో, భారతీయ సినిమాను ఏ స్థాయికి తీసుకువెళ్ళిందో, నవ్య ధోరణులకు ఎలాంటి పునాది వేసిందో... ఆ చరిత్ర అంతా ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు.

'పథేర్ పాంచాలీ'- సినిమాగా ఎంతటి ఖ్యాతి ఆర్జించిందో... ఒక నవలగా అది అంతకు ముందే గొప్ప ప్రశంసలను అందుకుంది. ఒక రకంగా పథేర్ పాంచాలీ బిభూతి భూషనుడి స్వీయ కథాత్మక నవల. దీన్ని ఆయన 1928-1929 మధ్య 'విచిత్ర' పత్రికలో సీరియల్‌గా రాశారు. 1929 నవంబరులో మొట్టమొదటగా పుస్తకం రూపంలో వెలువడింది. బెంగాలీ/ భారతీయ సాహిత్యంలో అప్పటికే సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ఈ నవలను చలనచిత్రంగా మలచటం ద్వారా సత్యజిత్ రే దీనికి అంతర్జాతీయ గుర్తింపునూ, శాశ్వతత్వాన్నీ తెచ్చిపెట్టారు.

చక్కటి బెంగాలీ గ్రామీణ జీవితపు అనుభవాలతో అలరారే బిభూతిభూషనుడి రచనలను చదవటమంటే ఈ విశ్వాన్ని, ఈ ప్రపంచాన్ని అతి సన్నిహితంగా దర్శించటమే. వీటిలో మనకు తారసపడే పిల్లలూ పెద్దలూ, వాళ్ల జీవితాలూ తత్వాలూ సజీవమైనవి. పైకి అతి వాస్తవికంగా కనబడుతుండే ఈ జీవితాల్లోనే ఊహాతీతమైనవేవో... విస్మయాలు, విభ్రమాలు మనల్ని ఎక్కడికక్కడ కట్టిపడేస్తుంటాయి. పథేర్ పాంచాలీలో కథ చాలా స్వల్పం. నిశ్చిందిపురంలో ఉంటున్న ఒక పేద బ్రాహ్మణుడి కుటుంబం, ఇల్లు, పిల్లలు, జీవిక కోసం వాళ్ళు చేసే పనులు, వారి దైనందిన అనుభవాలు...అంతే! ఈ చిన్న కథాంశాన్నే బిభూతి భూషనుడు ఇద్దరు పిల్లల కళ్ళతో, వారి పసి మనసుల్లో నుంచి పొరలు పొరలుగా దర్శింప జేస్తూ మనల్ని ఓ జీవితకాలపు అనుభూతికి లోనుచేస్తాడు. నిశ్చిందిపురంలోని తోటలూ, చెట్టుచేమలూ, కాయలూ పళ్ళూ ఎంత వాస్తవమైనవో 'దుర్గ', 'అపు' కూడా మన కళ్ళ ముందు అంతే వాస్తవంగా తిరుగుతుంటారు. తమ చిన్న ప్రపంచాన్ని క్షణం తీరికలేకుండా, బాల్య సహజమైన కుతూహలంతో, సాహసోపేతంగా కూడా శోధిస్తుంటారు. వాళ్ళ అపురూపమైన ఆశలు, చిన్న చిన్న కోర్కెలు, ఏవేవో గుసగుసల రహస్యాలు, కవ్వింపులు,

కుళ్ళుమొత్తనాలు... మనం ముచ్చటపడకుండా ఉండలేం! నిస్సహాయంగా వాళ్ళ స్నేహితులమైపోతాం. వాళ్లే లోకంగా, వాళ్ళతోనే ఉంటాం, వాళ్ళతోనే తిరుగుతాం. అందుకే దుర్గ మరణాన్ని మనం తట్టుకోలేం. కానీ ఆ విషాదాన్ని వాళ్ళ కుటుంబం తట్టుకుంటుంది. ఆ ఒక్క విషాదాన్నే కాదు, ఎన్నో వరుస విషాదాల్ని! పేదరికాన్ని, ఈసడింపుల్ని, ఈర్ష్యాసూయల్ని, ఎన్నో బెంగల్ని, జీవన్మరణాల్ని... ఎన్నింటినో నిభాయించుకుంటుంది. జీవిత పథం ఆశావహంగా, మరింత ముందుకే సాగుతుంటుంది.

'పథేర్' అంటే పథం, రహదారి మార్గం. 'పాంచాలీ'లనేవి తరతరాలుగా సంప్రదాయ కథాగానానికి ఉపయోగిస్తుండే బెంగాలీ గీతాలు. అందుకే సత్యజిత్ రే తన చిత్రానికి 'సాంగ్ ఆఫ్ ద లిటిల్ రోడ్' అని ఉపశీర్షిక జోడించారు. చింత-నిశ్చింతల మధ్య ఊగిసలాడుతుండే జీవన మార్గంలో ఎన్నో మలుపులు. అయినా ఆ పథం ముందుకే సాగుతుంటుంది. స్థల కాలాదులకు అతీతంగా జీవితాన్ని, మానవానుభూతులను సార్వత్రీకరించటంలో బిభూతి భూషన్ చూపించే అసమాన సామర్థ్యం అది. దుర్గ మరణంతో... పథేర్ పాంచాలీ నవల చివ్వర్లో అపు సొంత జీవితం ఆరంభమవుతుంది. (అది తర్వాతి నవల 'అపరాజిత'(1932)లో కొనసాగుతుంది.) పైకి జీవన మార్గం సూటిగా, సున్నితంగా సాగిపోతున్నట్టే ఉంటుందిగానీ... సామాజికంగా దీనికి ఉన్న విస్తృతి చాలా ఎక్కువ. మారుతున్న కాలంతోపాటే వ్యక్తులుగా తమ తమ జీవితాలకు అర్థాలను వెతుక్కుంటూ పల్లెల నుంచి పట్నాలకు వలసపోతున్న జీవితాలు అంతర్లీనంగా తరచూ మనల్ని కలవరపెడుతుంటాయి. ఉపందుకున్న పారిశ్రామికీకరణతో అప్పుడప్పుడే గ్రామాల గుండెల్లోకి దూసుకొస్తున్న నాగరికతా రైళ్ళు, అబ్బురంతో చూసే పసి మనసుల్లో అవి రేపే గుబుళ్ళు, కుటుంబాలను అతలాకుతలం చేసే అనూహ్య విలయాలు, తలవంచకుండా ఆత్మగౌరవంతో సాగించే పేదరికపు పోరాటాలు... ఇలా ఎన్నో బలీయమైన మానవ-సామాజిక సందర్భాలు నవల పొడుగునా పరంపరగా మనల్ని పలకరిస్తుంటాయి. మనసు ఆర్ద్రంగా మానవీయమవుతుంటుంది. అందుకే పథేర్ పాంచాలీ కరిగిపోయే కాలంతో ప్రమేయం లేని 'క్లాసిక్'గా ఎన్నటికీ వన్నె తగ్గకుండా నిలిచి ఉంటోంది.



# బిభూతిభూషన్ బంధోపాధ్యాయ

1894లో కోల్‌కతాకు ఉత్తరంగా వందమైళ్ళ దూరంలో ఉన్న మురాటిపూర్ గ్రామంలో పుట్టిన ఆయన బాల్యమంతా బీదరికంలోనే గడిచిపోయింది. చదువు స్థానిక పాఠశాలలో సాగింది. 1918లో కలకత్తాలోని రిప్పన్ కాలేజి నుండి డిగ్రీ పొందారు. మధ్యమధ్యలో రకరకాల వృత్తులు చేసినా ఎక్కువ భాగం మాత్రం ఉపాధ్యాయుడిగానే కొనసాగిన ఆయన తొలి కథ 1922లో కలకత్తా జర్నల్‌లో ప్రచురితమైంది. అప్పటి నుంచీ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ 17 నవలలు, 20 కథా సంకలనాలతో సహా 50 వరకూ పుస్తకాలు ప్రచురించారు. మొత్తమ్మీద ఆయన విఖ్యాత రచన, ఆయనకు గొప్ప కీర్తిని ఆర్జించిపెట్టిన రచన మాత్రం పథేర్ పాంచాలీనే! దీనికి కొనసాగింపుగా రాసింది అపరాజిత. దట్టమైన ప్రకృతితో మమేకమై, అంతరించిపోతున్న అరణ్యాల గురించి మనసులను సునిశితంగా హత్తుకునేలా రాసిన అరణ్యక (తెలుగులో వనవాసి) బిభూతిభూషనుడి మరో విశిష్ట రచన. ఆయన 1950లో మరణించారు.



# మద్దిపట్ల సూరి

మద్దిపట్ల సూరి 1920 జులై 7న తెనాలి దగ్గరి అమృతలూరులో జన్మించారు. తెలుగు, సంస్కృతం, బెంగాలీ, హిందీ భాషలపై గట్టి పట్టున్న ఆయన విశిష్ట బెంగాలీ సాహిత్యాన్ని సొగసైన నుడికారంతో, సహజ సుందర అనువాదంతో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. బిభూతిభూషన్‌తోపాటు ప్రఖ్యాత బెంగాలీ రచయితలైన తారాశంకర్ బెనర్జీ, శైలజానంద ముఖర్జీ, నిరంజన గుప్తా వంటి వారిని కూడా తెలుగు పాఠకులకు చేరువ చేసిన ఘనత సూరిదే. ఈయన అనువదించిన శాంబుడు (సమరేష్ బసు), సమయం కాని సమయం (బిమల్‌కర్), కలకత్తాకు దగ్గరలో (గజేంద్రకుమార్ మిత్ర) వంటి నవలలను సాహిత్య అకాడమీ ప్రచురించింది. భలేతమ్ముడు (1969), పండంటి కాపురం (1972), విచిత్ర దాంపత్యం (1971) వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు మాటల రచయితగా కూడా సుప్రసిద్ధులైన సూరి 1995 నవంబరు 19న మరణించారు.

# పథేర్ పాంచాలీ

నిశ్చిందిపురంలో హరిహరరాయ్‌గారి పాత పెంకుటిల్లు ఉత్తరపుకొస నుంది. అతడంత కలిగినవాడేం కాదు. తండ్రి ఇచ్చిపోయిన కొద్దిపాటి కొంప్రమీద వచ్చే రాబడికి తోడు, అయిదారుగురు శిష్యులిచ్చే వార్షిక గ్రాసాలు కూడా ఉండటంతో, మొత్తానికతడు ఏదో ఒడిదుడుకుల్లేకుండానే సంసారాన్ని నెట్టుకువస్తున్నాడు.

క్రితంరోజు ఏకాదశి. హరిహరునికి వరుసకి అక్కగారైన ఇందిరమ్మ ప్రొద్దున్నే పేలాలు ఫలారం చేస్తూ కూర్చొంది వసారాలో. ఆవిడ గుప్పెడు చెల్లగా గుప్పెడు నోట్లో వేసుకుని దంతాలతో తాటిస్తూ తినటం-హరిహరుని కూతురు ఆరేళ్ళ పిల్ల-గ్రుడ్లప్పగించి చూస్తూ ప్రక్కనే కూర్చుంది.

క్రమ క్రమంగా ఒట్టిపోతున్న గిన్నె కేసి కూడా చూస్తూనే ఉన్నదా పిల్ల. ఒకటి రెండు సార్లు అడుగుదామనుకుని, తీరా నాలిక చివరికి వచ్చాక అడగలేక ఊరుకుంది. ఇందిరమ్మ గిన్నె ఒట్టిదిచేసి ఆ పిల్లదానికేసి చూస్తూ ''కాసిని అట్టేపెట్టానులేవే అమ్మాయ్! అవిగో చూడు ఇంకా'' అన్నది.

''ఎందుకు, వద్దులే అత్తయ్యా! ఆ కాసిని కూడ నువ్వే తినేసెయ్'' అన్నదా పిల్ల బిక్క మొహంపెట్టి.

ఇందిరమ్మ తన దగ్గరున్న రెండు బొంత అరటిపళ్ళలో -ఒక దాంట్లో సగంముక్క ఆ పిల్ల చేతిలో పెట్టింది. దాంతో ఆ అమ్మాయి కింత మొహం అయింది. ఆవిడ పెట్టిన ఆ ముక్క కాస్తా ఎక్కడయిపోతుందో అని వాపిరిగొట్టులా కాస్త కాస్తే కొరుక్కుతినటం మొదలుపెట్టింది.

''మళ్ళీ అక్కడ ప్రాణాచారంపడి కూర్చున్నావా? రావేం ఇవతలకి'' అంటూ అవతల పంచలోంచి తల్లి గదమాయించింది.

''కూర్చోనిద్దూ. ఏం చేస్తుందది. కుందల్లే కూర్చుంది, అదేంచెయ్యటంలేదులే, కూర్చోనియ్'' అన్నది ఇందిరమ్మ

ఆవిడలా అన్నా, తల్లి ఊరుకోలేదు. ''ఎవరైనా అంటున్నప్పుడు ఎందుకలా వాపిరి గొట్టు మొహం వేసుకుని ఎదురుగా కూర్చోవటం? నా కలాంటివన్నీ కిట్టవు ఏమనుకున్నావో. రావేం ఇంకా? నీ క్కాదూ చెప్పేది?'' అంటూ తల్లి మరోసారి తీంర్డించింది.

ఆ అమ్మాయి భయం భయంగా లేచి వెళ్ళిపోయింది.

హరిహరరాయ్‌కి ఇందిరమ్మ చాలా దూరపు చుట్టం. మాతామహులవైపు తరాలన్నీ తిరగవేసిచూస్తే ఎక్కడో కలుస్తుందా చుట్టరికం. హరిహరుని తాత ముత్తాతలది ఊరుకాదు. వారిది పక్కనున్న యశ్‌డా విష్ణుపురం. హరిహరరాయ్ తండ్రి రామచంద్రరాయ్‌కి చిన్న తనంలోనే భార్య పోయింది. అయినా తనకి మళ్లీ పెళ్ళి చేద్దామనే సదుద్దేశ్యం తండ్రికి ఏకోశానా లేకపోవటం, అతడికి చాలా దారుణంగా తోచింది. నోరుతెరిచి అడగటానికి బిడియపడి ఓ ఏడాదిమాత్రం ఎలాగో గడిపేశాడు. అప్పటికీ తండ్రి అలాంటి ప్రయత్నమేమీ చేస్తున్నట్లు కన్పడకపోయేసరికి రామచంద్రరాయ్ చాటుగానే కాకుండా ఎదుటపడి కూడా రకరకాల అస్త్రాలు ప్రయోగించక తప్పలేదు. మధ్యాహ్నమప్పుడు మామూలుగానే భోంచేసి వచ్చి మంచంమీద పడుకుని, ఊరికే ఆపసోపాలుపడుతూండేవాడు. ఎవరైనా దగ్గరకొచ్చి 'ఏమిటలా ఉన్నావేం?' అని ఆదుర్దాగా అడిగితే 'ఎవరున్నారు నాకు? నా ఆలనా పాలనా ఎవరిక్కావాలి? కొంపతీసి ఏ తలనొప్పి అయినా వస్తే మాత్రం ఎవరు నాకిక్కడ దిక్కు?' అంటూ ఏడుపు మొహంపెట్టేవాడు. ఇలాంటి ఎత్తులన్నిటికీ పర్యవసానంగా ఈ నిశ్చిందిపురంలో రెండో వివాహం జరిగిందతడికి. పెళ్ళి అయిన కొద్దిరోజులకే తండ్రి చనిపోవటంతో విష్ణుపురంలో మకాం ఎత్తేసి, ఈ ఊళ్ళోనే స్థిరపడిపోయినాడు. ఇది అతడి చిన్ననాటి ముచ్చట...

రామచంద్రరాయ్ ఇక్కడికి వచ్చాక మామగారి ప్రోద్బలంతో పాఠశాల్లో చేరి సంస్కృతం చదవటం మొదలెట్టాడు. తర్వాత తర్వాత ఈ ప్రాంతాలకల్లా మంచి పండితుడనే పేరు కూడా తెచ్చుకున్నాడు. అయినా ప్రయోజకుడని అనిపించుకోతగిన పనిమాత్రం ఎన్నడూ చేసి ఎరుగడు. అసలలాంటిదేమీ చెయ్యలేదేమో అని శంకించటానికి కూడా కావలసినన్ని ఆధారాలుండేవి. భార్య, కొడుకు ఏడాదిలో తొమ్మిది నెలలు మామగారింట్లోనే ఉండేవారు. తాను షష్టిగడియాలూ పొరుగునవున్న పతిరామముఖర్జీగారింట చదరంగమో, చీట్లపేకో ఆడుతూ కూర్చుని, భోజనానికి మాత్రం రెండుపూటలా అత్తగారింట హాజరు అవుతూ ఉండేవాడు. 'ఏం పండిత మహాశయా! భార్య, పిల్లవాడు ఉన్నారాయె. వాళ్ళకైనా ఏదో గట్టి ఏర్పాటు చూడకపోతే ఎలా మరి?' అని ఎవరైనా మాటవరుసకి అంటే - 'మరేం బెంగ లేదు తమ్ముడూ! వ్రజచక్రవర్తిగారి గాదెల దగ్గిర రాలే గింజలు ఏరుకుంటున్నా చాలు, ఎన్ని తరాల వారికైనా చులాగ్గానే గడిచిపోతాయి రోజులు!' అని సమాధానం చెప్పేసి, అంతలో మళ్ళీ తన దగ్గిరున్న త్రించా పొడితో ఎదుటివాడి కొంప నిలువునా ఎలాగా కూల్చటం అన్న ఆలోచనలోపడిపోయేవాడు - రామచంద్రరాయ్.

వ్రజచక్రవర్తిగారి ధాన్యపుగాదెల స్థిరత్వానికి సంబంధించినంతవరకు, తనది యెంత తప్పు అంచనా అయిందీ మామగారు చనిపోయాక రామచంద్రరాయ్‌కి తెలిసిరావటానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఊళ్ళో అతడికి వేరే భూమీ - పుట్రా యేంలేదు. అయితే అక్కడా అక్కడా అయిదారుగురు శిష్యులు మాత్రం దొరికారు. వాళ్ళ సాయంతో సంసారాన్ని



గడుపుకుని వస్తున్నాడు. అతడి పెళ్ళికిముందు వాళ్ళ దాయాది సోదరుడొకడు ఆ యింటి ఆడపడుచునే చేసుకున్నతడున్నాడు. వాళ్ళ కుటుంబం కూడా యిక్కడే వుండేది. రామచంద్ర రాయ్‌కి వాళ్ళు కూడా సాయంచేస్తూండేవాళ్ళు. ఆ దాయాది సోదరుని కొడుకు నీలమణి రాయ్ 'కమిషరేట్'లో పనిచేస్తూండేవాడు. ఉద్యోగరీత్యా అతడెప్పుడూ పరాయిదేశంలో వుండవలసి రావటంతో యిక్కడి నివాసం యెత్తేసి, చివరికి ముసలి తల్లినికూడా తీసుకుని, తాను ఉద్యోగం చేస్తున్న ఊరికి వెళ్ళిపోయాడు. ఇప్పుడా యింట్లో యెవరూలేరు.

తూర్పు ప్రాంతంవాడైన ఓ సుప్రసిద్ధ కులీనుడు ఇందిరమ్మని చేసుకున్నాడని చెప్పు కునేవారు. పెళ్ళయ్యాక ఆమె భర్త యెప్పుడన్నా ఓసారి ఆ ఊరు రావటంకూడా కద్దట! వచ్చినప్పుడు ఓ రాత్రో, రెండు రాత్రులో వుండి, త్రోవ ఖర్చులూ, కులీనులకు జరగవలసిన గౌరవ సన్మానాలూ రాబట్టుకుని, వచ్చినట్టు హాజరు మాత్రం వేయించుకుని, మళ్ళీ మూటా - ముల్లె కట్టుకుని, వరుసక్రమంలో తర్వాతి అత్తవారింటికి వెళ్లిపోయేవాడట; అంచేత భర్తంటే ఇందిరమ్మకెప్పుడూ అంతగట్టిగా గుర్తు కూడా ఉండేవాడుకాదట! తల్లిదండ్రుల తదనంతరం ఆమె తమ్ముడుదగ్గరే వుంటూ కాలం వెళ్లతీస్తూ వచ్చింది. కాని కాలం కలసి రాకపోవటంలో ఆ తమ్ముడు కూడా చిన్న వయసులోనే చనిపోయాడు...ఆ తర్వాత కొద్ది రోజులకే హరిహరుని తండ్రి రామచంద్రరాయ్ వారి నివేశనంలో ఇల్లుకట్టాడు. ఇందిరమ్మ ఈ ఇంట్లో అడుగుపెట్టడం అదే మొదలు. అవన్నీ కాలంనాటి గాథలుకాని ఈనాటి కథలు కావు.

ఆ తర్వాత చాలారోజులు గతించాయి...శంఖాల చెరువులో తామరదొంతర్లు ఎన్నో విడతలు పుట్టాయి, అంతరించాయి. చక్రవర్తిగారి ఖాళీస్థలంలో సీతానాథముఖర్జీ క్రొత్త రకపు మొక్కలన్నీ తెచ్చి తోటవేశాడు. ఆ మొక్కలన్నీ పెరిగి పెద్ద మ్రానులై, ఈనాడు పడి పోయే స్థితిలో వున్నాయి. ఎన్నో నివేశనాల్లో క్రొత్త కుటుంబాల ఇళ్ళు లేచాయి. పచ్చని కుటుంబాలుండే ఎన్నో ఇళ్ళు పాటిదిబ్బలైపోయాయి. ఎంతమంది వ్రజచక్రవర్తులు, గోలోక చక్రవర్తులో చితికిపోయారు, చినికిపోయారు. ఇచ్ఛామతీ స్వచ్ఛజలవాహినితో పోటీపడి, ఇక్కడి నీలితోటల యజమానులైన ఎంతమంది జాన్సన్‌లను-టాన్సన్‌లను, కూలీలను, జీలుగుబెండుల్లా, అలల అంచుల నురుగులా ఏయే తీరాలకు విసరిపారేసిందో!...

ఇందిరమ్మ మాత్రం ఇంకా ఇప్పటికీ బ్రతికేవుంది. ఆవిడ పద్దెనిమిదివందల ముప్పై నాలుగో సంవత్సరంలో-మిసమిసలాడుతూ వయసు ముమ్మరంలోవున్న పడుచు కాదు; డెబ్బై అయిదేళ్ళు పైబడ్డ పండువృద్ధు. దవడలు జారిపోయి తోళ్ళలా వ్రేళ్ళాడుతున్నాయి. నడుమువంగి, పల్లకీ బొంగులా అయిపోయింది. చూపు మునుపటంతదూరం ఆనటం లేదు. ఎండచురుకు తట్టుకునేందుకు కళ్ళకిపైన చెయ్యి అడ్డం పెట్టుకుని, "ఎవరా వచ్చేది? నవీనా? బేహారా? అహఁ. కాదల్లేవుందే! హరి నువ్వా రాజూ!" అంటూ దారిపోయే వాళ్ళని పలకరిస్తూ ఉంటుంది.

ఇందిరమ్మ కళ్లముందు ఈ వాడని కూడా ఎన్ని మార్పులొచ్చాయని! ఇప్పుడు అడవిలా ఉన్న ఈ వ్రజచక్రవర్తి గారి స్థలంలో - ఆ రోజుల్లో ఆశ్వయుజ పూర్ణిమనాడు ఊరివారంతా కలిసి సంతర్పణ చేస్తూ వీధికి విస్తళ్లేసి వడ్డించేశారు. ప్రొద్దునకాని, సాయంత్రముకాని, ఊరి మంటపం దగ్గరికి రచ్చబండ దగ్గరికీ వచ్చి కూర్చునేవాళ్ళు ఎవరైనా! అప్పుడిదంతా ఇలా వెదురు తుప్పలతో, కుప్పలతో నిండి వుండేదా? పుష్య శుద్ధ పూర్ణిమకు క్రొత్త ధాన్యం గాదెల కెక్కించేముందు అరబస్తాడైనా తీసి అటుకులవడ్లు పోసేవారు.కళ్ళు మూసుకుంటే చాలు, ఇందిరమ్మకి ఆ రోజులు కళ్ళకు కడుతుంటాయి. రాయ్‌గారి చిన్న కోడలు ఇరుగు పొరుగమ్మల్ని ఇద్దరు ముగ్గుర్ని వెంటబెట్టుకుని ఎంత ఠీవిగా వచ్చేది అటుకుల్లో పోటు వేయడానికి! కుందనపు బొమ్మలాంటి కోడలు. ఎర్రగా ఒరిసిన అరచేతుల్ని మధ్య మధ్య ఉఫ్ ఉఫ్ అని ఊదుకుంటూ వెనక్కీ ముందుకీ ఎంచక్కగా అడుగువేస్తూ ఎంచక్కగా వేసేది పోటు! కోడలంటే కోడలా! చక్కనిచుక్క. గుణాల కుప్పగదూ. ఇందిరమ్మకి యీ రాతొచ్చిన కొత్తల్లో ప్రతి ద్వాదశికీ తానే ఏ చలిమిడో ఏదో ఫలహారం చేసి స్వయంగా తీసుకువచ్చి, దగ్గిర కూర్చొని తినిపించేది. వాళ్ళంతా ఏమైపోయారో! ఆ కాలం ఏమయి పోయిందో! కాస్త కష్టం, సుఖం చెప్పుకుందామన్నా ఆనాటి వాళ్లెవరూ బ్రతికిలేరు కదా ఇప్పుడు.

ఆ తర్వాత ఈ కుటుంబంలో రామచంద్రరాయ్ దాటిపోయాక, అతడి కొడుకు హరిహరరాయే దిక్కయినా ఆమెకి. అప్పటికిత డెంత? బొట్టికాయలా వుండేవాడు. ఎప్పుడూ ఊరికే చెరువుల వెంట, దొరువుల వెంట, చెట్ల పుట్ల వెంట దిప్పకాయలా తిరుగుతుండే వాడు. ఓనాడు చింతగుల్ల కోసమని ముఖర్జీగారి చింతచెట్టు చిటారుకొమ్మకెక్కి, అక్కడి నుంచి పడి చెయ్యీ కాలూ విరగ్గొట్టుకుని, తర్వాత రెండు నెలలు మంచమెక్కాడు కదూ! ఇప్పటిదా ఎప్పటిమాటో యిది! అతడికి చిన్న తనంలోనే ఎంతో ఫెళఫెళాగ్గా పెళ్ళయింది! తండ్రిపోయాక ఆ పెళ్ళాడిన పదేళ్ళ పిల్లనీ పుట్టింట్లోనే విడిచిపెట్టి దేశాలమీదికి పోయా డెక్కడికో. ఏడేనిమిదేళ్ళదాకా ఏమైపోయాడో అజా-పజా తెలియనేలేదు. తర్వాత ఏడాదికీ ఆర్నెల్లకీ ఎప్పుడైనా ఓ ఉత్తరమ్ముక్క రాయటం మొదలులెట్టాడు. అప్పుడో అయిదు ముసలమ్మ పేర మనియార్డరు కూడా పంపిస్తూ ఉండేవాడు...ఈ యింటిని కనిపెట్టుకుని ఉండటానికై ఆమె ఎన్ని కష్టాలుపడాల్సి వచ్చింది. ఎన్ని ఉపోషాలు చేయాల్సి వచ్చింది! ఎదుటివారి దయాధర్మాలకై ఎందరి గుమ్మాల్లోనే పడిగాపులుపడి ఉండాల్సివచ్చింది. ఎన్ని దిగుళ్ళుతోనో రోజులు వెళ్ళతీయాల్సి వచ్చింది!

చాలా కాలానికి హరిహరరాయ్ తిరిగివచ్చి, కాపురం పెట్టి ఓ యింటివాణ్ణి అయినా నని అనిపించుకున్నాడు. ఇది జరిగి కూడా ఆరేడేళ్ళయిందిప్పటికి. అతడికో కూతురు కూడా పుట్టింది. ఆ పిల్లదానికి అయిదారేళ్ళున్నాయి. ఇన్నాళ్ళకి మళ్ళీ ఆ వెనుకటి సంసారపు కుదుట పడింది. ''అమ్మయ్య'' అనుకుంది ఇందిరమ్మ. తన గుడిగుడికుంచపు బ్రతుకులో ఆవిడ మరొక సుఖాన్ని దేన్నీ ఆపేక్షించలేదు. తక్కిన సుఖదుఃఖాల్ని గురించి తాపీగా కూర్చుని



ఆలోచించలేదు. అశక్తురాలావిడ. మొదట్నుంచీ అలవాటైపోయినా ఆ వెనుకటి బ్రతుకుబాట లోకే-మలుపు తిరిగయినా మళ్ళీ రాగలిగితే చాలు, అదే పదివేలు ఆవిడకి. అంతకుమించిన ఆనందం ఆవిడకి లేనేలేదు.

హరిహరుని కూతురు ఒక్కక్షణం కనుమరుగైతే చాలు, ఆవిడ ప్రాణం కొట్టుకు పోయేది! కాలం నాడావిడకీ ఓ కూతురుండేది, విశ్వేశ్వరి...చిన్నతనంలో పెళ్లయింది. పెళ్లయిన కొద్ది రోజులకే ఆ పిల్లకాస్తా పోయింది. నలభై యేళ్లకి మళ్ళీ ఆ విశ్వేశ్వరే ఇలా హరిహరుని కూతురు రూపంలో అనాథయైన తన తల్లి ఒడిలోకి వచ్చిందా అనిపించేది! నలభైయేళ్ళ నుంచీ ఆవిడలో నిద్దరోతున్న మాతృత్వం-ఈ పిల్లదాని ముఖంలోని భయవిహ్వలమైన చాంచల్యంతో, ఆ అమాయకపు కళ్ళలో తొణికిసలాడే నవ్వుల తరకలతో - తన బ్రతుకు తుదముట్టిపోతుందే అన్న ఆందోళనతో మేల్కొన్నట్లుంది.

కాని ఆవిడ అనుకున్నంత చల్లగా మాత్రం రోజులు వెళ్ళటంలేదు. హరిహరుని పెళ్ళాం చూపులకెంత చక్కని చుక్కయితే ఏంలాభం! ఆమె నోరు తెగ దురుసు-మాట మహా పెళుసు. ఒట్టి కజ్జాకోరు మనిషి. తనని కంటినిండా చూడలేదు. నా అనే వాళ్ళందర్నీ నట్టేట కలుపుకుని ఎక్కడి నుంచో శని దేవతలా వచ్చి కూచుందిట. తానీ యింట్లో! అన్నిటి కన్నా చోద్యం, తనకీ వారికీ ఏవంకచూసినా చుట్టరికమే లేదట! తేరగా తిండి తింటానికే వచ్చి కూర్చుందిట!...

ఆమె చిన్న-చితుక ప్రతీదానికీ పనివేళా ముసలమ్మతో మూడు పూటలా తగవు పెట్టుకుంటూంటుంది. ఆ తగవు మరి ముదిరినప్పుడల్లా ఇందిరమ్మ తన పాత ఇత్తడి చెంబు, చింకి గుడ్డలమూట చంకనెట్టుకుని బయలుదేరి ''పోతున్నానులే అమ్మా, పోతున్నా లే. మళ్ళీ ఈ నట్టింట అడుగుపెడితే నా పేరు -'' అంటూ బయటికి నడిచేది. పగలల్లా దిగులుతో, ఏ వెదురుతోపులోనో కూర్చుని గడిపేసేది. ఆవిడ అక్కడ ఉన్నట్లు హరిహరుని కూతురు సాయంత్రానికల్లా పసికట్టి, పరుగుపరుగున వెళ్ళి, కొంగుపట్టుకు లాగుతూ ''రా, అత్తయ్యా. ఇహ నీతో ఎప్పుడూ పోట్లాడవద్దని అమ్మతో నేను చెబుతాన్లే రా.'' అనేది. ఆ పిల్ల దాని చెయ్యిపుచ్చుకుని, చీకటిపడే వేళకల్లా ఇందిరమ్మ మళ్ళీ మామూలుగా ఇంటికి వచ్చేసేది. సర్వజయ మొహం ముటముటలాడించుకుంటూ ''వచ్చావా మళ్ళీ? రాక ఎక్కడి కేమిటి వెళ్ళేది ఏట్లోకి! ఎక్కడికైనా వెళ్ళి వుండేందుకు ఇంతకుతప్ప వేలెడంత ఇరవుంటేగా! మళ్ళీ మాట్లాడితే ముక్కూడిపోయేటంత రోషాలు మాత్రం వున్నాయి.'' అనేది.

ఆమె ఇలా ఆడిపోయటం ఇవాళేం క్రొత్తకాదు. తాను ఈ యింటికి కాపురానికి వచ్చినప్పట్నుంచీ మొదలెట్టింది. ఇలా లెక్కలేనన్నిసార్లు జరిగిందిప్పటికి. ఇలాంటివి మామూలైపోయాయి.

హరిహరుని నివేశనంలోనే తూర్పు ప్రక్కన ఒంటి నిట్టాడి పూరిపాక ఒకటి చాలా రోజుల్నుంచి మరమ్మతుల్లేకుండా పడివుంది. ఇందిరమ్మ ఆపాకలోనే ఉంటూంటుంది.

దణ్ణెంగడమీద రెండు పాత సైను పంచెలు వ్రేలాడేసి వుంటాయెప్పుడూ, చిరుగులున్న చోట చివరలు రెండూ కలిపి వేసుకుంటుంది. ఇందిరమ్మ కిటీవల సూదిలో దారం ఎక్కించ లేనంతగా చూపు సన్నగిల్లిపోవటంతో చిరుగులు కుట్టుకునే భాగ్యం కూడా లేకుండా పోయింది.

మరీ పేలికలైపోతే మాత్రం ముళ్లెట్టుకుంటుంది. ఓ చినిగిపోయిన చాప, అలాంటిదే ఓ కప్పుకునే బొంత కూడా ఉన్నాయి. మంచి బొంత ఒకటి కుట్టుకుందామన్న ఆశకొద్దీ ఇక్ష్వాకుల బారసాల నుంచి భద్రపచుకున్న పాతగుడ్డ పీలికల మూట కూడా ఒకటుంది. కాని వాటి అవసరం ఎప్పుడూ వచ్చినట్టులేదు. ఇప్పుడొకవేళ వచ్చినా బొంతపట్టుకోగలిగినంత చూపెక్కడుంది బొందిలో! అయినా వాటిని మాత్రం అలాగే పదిలంగా దాచిపెడుతూ, భాద్రపదమాసం వెళ్ళగానే ఓసారి ఆ మూటవిప్పి, వాటిని ఎండలో వేస్తూ వుంటుంది. తన పెళ్ళికి అరణం ఇచ్చిన పేము పెట్టెలో ఎర్ర అంచు చీరెల్లో ముక్కలు కొన్ని దాచిపెట్టి వుంచింది. అవి ఆవిడ కూతురు విశ్వేశ్వరివి...ఇవికాక ఓ మాటేసిన ఇత్తడి చెంబు, రెండు మూడు మట్టి ముంతలు, ఒకటో రెండో మట్టిదాకలూ కూడా వున్నాయి. ఒక దాంట్లో కాసిని పేలాలు, కాస్త పేలపిండి, ఓ దాంట్లో కాస్త ఉప్పు కారం, మరొకదాంట్లో రవంత నూనె, ఇంకోదాంట్లో ఇంత ఖర్జూరపు పండు కూడా జాగ్రత్త పెట్టుకుంది. నోరు తెరిచి అడిగినా సర్వజయ అన్నప్పుడల్లా ఇలాంటివన్నీ ఇవ్వకపోవచ్చునని, ముసలమ్మ ముందు జాగ్రత్తలో మంచిగా వున్నప్పుడే వీటిని సంగ్రహించి, ఆ పెళ్ళినాటి పేముపెట్టెలో పదిలపరచు కుంది.

సర్వజయంటే ఈ పాకలోకి ఎప్పుడైనా ఓ మారు వస్తుంది కాని, నిత్యం సందెవేళ ఆమె కూతురు ఆరేళ్ళ పిల్ల దుర్గ వచ్చి, పంచలోపరచిన చిరుగుల బొంతమీద కూర్చుని, ముసలమ్మచేత బోలెడన్ని కథలు చెప్పించుకుని వింటూ ఉంటుంది. ఏ కథ చెప్పినా చివరికి మళ్ళీ - "అత్తయ్యా, ఆవేళ చెప్పిన దొంగల కథ మళ్ళీ చెప్పవూ?...అదే! యాభై యేళ్ల క్రితం - ఊళ్లో వెలి అయిన వాళ్ళింట్లో దొంగలుపడ్డ కథ చెప్పావే, అదే!" అని అడుగుతూ వుంటుంది. ఎన్నిసార్లు చెప్పినా, ఎన్ని కథలు చెప్పినా మధ్య మధ్య మళ్ళీ ఆ కథ ఇంకొకసారి చెప్పందేమాత్రం ఆ పిల్ల విడిచిపెట్టదు...ఇహ తర్వాత ఆవిడచేత పూర్వోత్తరపు పాటలన్నీ పాడించుకుని వింటూ వుంటుంది. ఇందిరమ్మకు ఆ కాలంనాటి పాటలు చాలా నోటికివచ్చు. అన్ని పాటలూ రావటంవల్ల చిన్నప్పుడు తన సావాసకత్తెలలో ఆమెకెంతో పేరు, మెప్పు ఉండేవి. ఈ కాలంలో అసలవన్నీ ఆసక్తితో వినేవాళ్ళే కరువయారు. అంచేత ఆ పాటలన్నీ ఎక్కడ తుప్పుపట్టిపోతాయో అని ఇప్పుడు నిత్యం సందె దీపాలవేళ ఆవిడ ఆ పాటలన్నీ యీ పిల్లదానికి పాడి వినిపిస్తూ, తాను జ్ఞాపకం చేసుకుంటూ వుంటుంది.

"ఒప్పులకుప్పా-విన్నావా యీ చోద్యం?
సందెవేళను, దొంగవోలెను-గో..."



అంతవరకు పాడి ఇందిరమ్మ నవ్వు మొగంతో ఆ పిల్లకేసి చూడగానే..."నిందు డరిగెను, రాధయింటికి..." అంటూ ఆ అమ్మాయి అందుకుని ఇందిరమ్మ గొంతులో గొంతు కలిపేది. ఆవిడ "విం"కి ఊతంయిచ్చి నొక్కిపాడటం ఆ పిల్లకెంతో బావుండేది.

ఇందిరమ్మ సగం సగం చరణాలు పాడి, ఆ పిల్లదానిని బురిడీపుచ్చటానికి మిగిలి నవి జ్ఞాపకం చేసుకుని పాడుతానులే అంటే, పదిరోజులు పోయినా అవి మరచిపోకుండా మిగిలిన చరణాలు పాడేదాకా వేపుకుతినేది ఆ పిల్ల.

బాగా చీకటిపడ్డాక తల్లి అన్నానికి రమ్మని పిలవగా పిలవగా అప్పుడు లేచి వెళ్ళేదా పిల్ల.

## 2

హరిహరరాయ్ తాత ముత్తాతల నివాసమైన యశ్డా విష్ణుపురంలో ఐశ్వర్యవంతు లైన చౌధరీ వంశీయులు వెనుక యెప్పుడో కొందరు బ్రాహ్మల్ని ఈనాములిచ్చి పిలిపించి, వారికక్కడ స్థిరవసతులు కల్పించారు. అలా అక్కడికి వచ్చి వున్న వారిలో హరిహరరాయ్ పూర్వ పురుషుడు విష్ణురామరాయ్ ఒకడు.

అప్పటికింకా దేశంలో బ్రిటిష్ పరిపాలన స్థిరంగా పాతుకోలేదు. దారులూ, డొంకలూ దొంగలతో, దోపిడీగాండ్రతో నిండివుండేవి. ఈ దొంగల ముఠాల వాళ్ళందరూ చాలావరకు దొమ్మరి, ఉప్పరి, యానాది, ఒడ్డెరకులాలకు చెందినవాళ్ళు. ఉక్కు తునకల్లా ఒళ్ళూ వాళ్ళూ ఎలా ఉండేవాళ్ళని! కత్తిసాము, కర్రసాముల్లో గడితేరిన వాళ్ళు. ఆ కాలంలో చాలా వాళ్ళు చాటుగా నెలకొల్పిన కాళికాలయాల చిహ్నాలు ఇప్పటికీ ఉన్నాయి. పగలల్లా మామూలు పెద్దమనుషుల్లాగానే నటిస్తూ చీకటిపడగానే కాళికి మ్రొక్కి, దూరపుటూళ్ళలోని సంపన్నుల యిళ్ళు దోచుకోటానికి బయలుదేరేవాళ్ళు. ఆ కాలంలో అయిన కుటుంబాల వాళ్ళు కూడా చాలామంది, తాము చాటున ఉండి యిలా దొంగతనాలు చేయించి ఆర్జించే వాళ్ళు. వంగదేశంలోని చాలా మంది జమీందారులు, సంపన్నుల సంపదలకు పునాదులు- వాళ్ళ పూర్వులిలా ఆర్జించిన ధనరాశులే ప్రాచీన వంగదేశ చరిత్ర క్షుణ్ణంగా తెలిసినవారందరికీ ఈ సంగతి తెలుసు....

విష్ణురామరాయ్ కుమారుడు వీరురాయ్‌ని గురించి కూడా ఇలాంటి అపప్రథే ఉండేది. అతడి చేతి క్రింద జీతాలకి పనిచేసే దొంగలముఠా ఒకటుండేది. నిశ్చిందిపురం గ్రామానికి ఉత్తరంగా "చాయాడాంగా" నుంచి నవాబ్‌గంజ్ మీదుగా 'తాకీ'కిపోయే నాటు బాటకి ప్రక్కగా "సోనాడాంగా" మైదానం మధ్యన వున్న ముసలమ్మ చెరువుగట్టు ఈ ముఠావాళ్ళ పీఠం. ఆ చెరువు ఒడ్డున తరతరాలనాటి నుంచి వున్న మర్రిచెట్టు చాటున దాక్కుని వుండి, దారినపోతున్న బాటసారులను అడ్డగించేవాళ్ళు. వీళ్ళ దోపిడీ పద్ధతి అంతా వేరు. దారినపోయేవాళ్ళను ముందు దుడ్డుకర్రలతో మోది చంపి, తర్వాత వాళ్ళ దగ్గిర ఏ మేం ఉన్నాయో అని తడిమేవాళ్ళు. తీరా వాళ్ళు ప్రాణాలు వదిలాక ఒక్కొక్కళ్ళ దగ్గిర

ఎర్రని ఏగాని దొరకకపోవడం కూడా కద్దు. అందులో వింతేమీలేదు. ఆ శవాన్ని చెరువులోకి లాగి కుక్కి, ఈ దండగమారి శ్రమకు ఈసారి వచ్చేవాళ్ళ దగ్గరైనా ఇంతకింత ప్రతిఫలం గుంజుకు తీరాలనే తహతహతో మళ్ళీ ఆ మర్రిచెట్టుక్రిందికి చేరుకునేవాళ్ళు. ఆ గ్రామానికి ఉత్తరంగా ఉన్న మైదానంలో ఆ మర్రిచెట్టు యిప్పటికీ ఉంది. ఆ దారి ప్రక్కనే పల్లంగా వుండే ప్రదేశాన్ని ఇప్పటికీ ముసలమ్మ చెరువనే అంటూవుంటారు. చెరువు తాలూకు చిహ్నాలు మాత్రం యేమీలేవు యిప్పుడు. ముప్పాతిక మువ్వీసం అంతా పూడిపోయింది. దుక్కులు దున్నే రోజుల్లో ఆ పల్లపు చోటులో ఇప్పటికీ రైతుల నాగలి కొర్రులకు మానవ కలాపాలు బయటపడుతూనే ఉంటాయి.

పరంపరగా చెప్పుకునే పాత గాధ ఒకటుంది-తూర్పు ప్రాంతీయుడైన ఓ ముసలి బ్రాహ్మణుడు కొడుకుని వెంటపెట్టుకుని, కాలీగంజ్ ప్రాంతాల నుంచి శ్రీపురంమీదుగా మళ్లీ తన దేశం వెడుతూ ఈ దారిన వచ్చాడట! కార్తీకమాసపు చివరిరోజులవి. కూతురు పెళ్ళికి సొమ్ము సంతనాచేసుకోటానికై ఈ ప్రాంతానికి వచ్చాడు. ఆయన దగ్గిర కొంత నగదు, ఇతర సామగ్రికూడా ఉన్నాయి. మధ్యాహ్నం హరిదాసపురం సత్రంలో ఆగి, వంటచేసుకుని భోంచేసి, ప్రొద్దు ఏటవాలుకి తిరగగానే మళ్ళీ బయలుదేరి నడక సాగించారు. అక్కడికి అయిదు క్రోసుల దూరంలో వున్న నవాబ్‌గంజ్ చేరుకుని, ఆ రాత్రికి అక్కడ సత్రంలో ఉందామని వారి సంకల్పం. దొంగల భయం ఉన్న దారి అన్న సంగతి తెలియనిది కాదు. కాని అంచనాలో వ్యత్యాసం వచ్చి ఉంటుంది! కార్తీక మాసం, పగలు ప్రొద్దు తక్కువ. నవాబ్‌గంజ్ చేరుకోటానికి చాలా ముందుగానే "సోనాడాంగా" మైదానంలో ప్రొద్దు చర్రున జారిపోవటం చూసి, వారు కాస్త ఝాడించి గబగబ నడవటం మొదలెట్టారు. ఈ చెరువు గట్టు ఎక్కుతూనే దొంగల చేతికి చిక్కాడు.

ముందు దొంగలు దుడ్డుకర్రతో బ్రాహ్మణ్ణి నెత్తిమీద మోదారు. అతడు ప్రాణభయం కొద్దీ కేకలెట్టుకుంటూ మైదానానికి అడ్డంపడి పరుగెత్తసాగాడు. అతడి వెనకాలే కొడుకు కూడా పరుగు అందుకున్నాడు. కాని ఒకరు వృద్ధుడు, మరొకడు కుర్రవాడు-దొంగలకు చిక్కకుండా ఎంతదూరమని పరిగెత్తగలరు? కాసేపట్లోనే దొంగలొచ్చి చుట్టుముట్టారు. ఇహ చేసేదేంలేక ఆ బ్రాహ్మడు - తనని చంపితే చంపారు కాని కొడుకైనా ప్రాణభిక్ష పెట్ట మని, వంశానికి వాడొక్కడే అంకురమని, వాడు కాస్తాపోతే తనకు "పిండలోపం" జరుగు తుందని ఎన్నో విధాల వాపోతూ వాళ్ళని వేడుకున్నాడట. ఆనాడు కర్మవశాత్తు ఆ ముఠాలో వీరురాయ్ కూడా వున్నాడట. అతణ్ణి బ్రాహ్మణ్ణిగా గుర్తించి ప్రాణభయార్తుడైన వృద్ధుడు దగ్గిరకు వచ్చి, తన కొడుకునైనా విడిచిపెట్టమని కాళ్ళు పట్టుకున్నాడట. కాని తనకి పిండ లోపం జరిగితే అది ఎదుటివాడికి కంఠంపట్టుకునే సమస్య కాదన్న సంగతి పాపం, ఆ వెర్రి బ్రాహ్మడు గ్రహించలేకపోయాడు. ఆ కుర్రవాణ్ణి అలా వదిలెయ్యటమయినా ఆ దొంగలకి ప్రమాదమేగా, దురదృష్టవంతులు అయిన ఆ తండ్రీ లేడు. వంటలవటానికి ఆలశ్యం



వుందని, వెన్నెల్లో కాసేపు ఆ ఇసుకలంక మీద తిరిగివద్దామని వాడింతకుముందే పడవదిగి వెళ్లాడని తెలిసింది. పల్లెవాళ్ళ ముఖాల్లో బల్లెం పొడిచినా నెత్తురు చుక్కలేదు. ఈ లంకల్ని గురించి వాళ్ళకి వున్న అనుభవాల్ని బట్టి, రెల్లు పొదచాటున పల్లపు ప్రదేశంలోని ఒక మొసలివచ్చి పొంచివుండి వుంటుందని, వీరురాయ్ కొడుకు ఆ ఇసుకతిన్నె మీదికి రాగానే వాడిని చటుక్కున పట్టుకుని నీళ్ళలో దుమికి వుంటుందనీ ఊహించారు.

తర్వాత ఇహ జరగవలసిన తతంగం అంతా జరిగింది. పడవ తెడ్లు బుజాల్నెట్టుకుని అందరూ ఆ లంకంతా తిరిగి వెతికారు. పడవలో నది నడిమయందాకా వెళ్ళి, అర్ధరాత్రి వరకు గడలు వేసి దేవి చూశారు. ఏంచేసినా ఆనూ-పానూ చిక్కలేదు. ఆ తర్వాత ఏడుపులు-పెడబొబ్బలు-అంతకంటె చేయగలిగిందేముంటిందిహ? నిరుడు ఇంచుమించు ఇదే వేళకి ముసలమ్మ చెరువు ఒడ్డున జరిగిన సంఘటనను, ఈ ఏడు ఏ అదృశ్య న్యాయాధిపతో నిర్మానుష్యంగా వున్న ఈ ఇఛ్ఛామతి నది ఇసుకలంకమీద విచారణ జరిపి తీర్పు యిచ్చి నట్లుయింది. ఆ అదృశ్య న్యాయాధిపతిని ముసలమ్మ చెరువులోని జమ్ముదుబ్బులు మభ్య పెట్టలేదని, కారుచీకట్లోనయినా అతడు తన న్యాయపథాన్ని గుర్తించగలడనీ, ధూర్తుడైన వీరురాయ్‌కి ఇంత దైవ వంచన జరిగాక ఇప్పటికి తెలిసివచ్చింది.

ఇంటికి తిరిగివచ్చాక వీరురాయ్ ఇంక అట్టేకాలం బ్రతకలేదు. వాళ్ళ వంశంలో ఇహ నిది ఒక విపరీతపు ఆనువాయితిగా మారింది. అతడివంశం లుప్తమైపోయినా అతడి సోదరుల వంశవృక్షం నిలిచింది. కాని ఆ వంశంలో కూడా జ్యేష్ఠ సంతానం అనేది జీవించట మంటూలేదు. పది పన్నెండేళ్ళు వచ్చి బాల్యం గట్టెక్కేలోగానే ఏదో ఒక జబ్బుతో వైతరిణి గట్టెక్కేవాళ్ళు వారు...ఈ వంశానికి బ్రాహ్మణ శాపం తగిలించుకునేవారు లోకులు. హరిహర రాయ్ తల్లి మాత్రం తారకేశ్వరుని దర్శించుకుని, ఆ ఆలయంలోని ఒక సన్యాసిని అర్థించి రక్షరేకు ఒకటి తెచ్చుకుంది. రక్షరేకు ప్రభావంవల్లనయితేనేం, రెండు మూడు తరాలు గడిచేసరికి బ్రాహ్మణ శాపంలోని పటిమ కర్పూరంలా హరించిపోవటంవల్లనయితేనేం, ఇంత వయస్సు వచ్చేంతవరకూ హరిహరుడు మాత్రం బ్రతికే వున్నాడు.

## 3

కొన్ని రోజులు గడిచిపోయాయి.

హరిహరరాయ్ కూతురు దీపాలు పెట్టగానే పోయి పడుకుంది. ఇంట్లో వాళ్ళత్తయ్య లేదు. ఓనాడు దేనికో వాళ్ళమ్మకీ - అత్తయ్యకీ జగడమయింది. ఆ ఆవేశంలో ఆవిడ దూరాన ఎక్కడోవున్న దగ్గిరచుట్టా లెవరింటికో వెడుతున్నానని చెప్పి వెళ్ళింది. వెళ్లి అప్పుడే రెండు నెల్లయింది. తల్లికీ మధ్య ఒంట్లో అంత ఓపికగా ఉండకపోవటంతో ఆ అమ్మాయి ఆలనా-పాలనా పట్టించుకునేవాళ్ళే లేరింట్లో. దానికితోడు నిన్నటినుంచీ తల్లి పురిటిగదిలోకి పోయి పడుకోవటంతో -అసలిప్పుడు తిన్నానా - తినలేదా అని అడిగేవాళ్ళు కూడా లేరు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=737**

* * *